క్లుప్తంగా

అన్నదానం



అన్నప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

రాజాం: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో శ్రీ నవదుర్గా ట్యాక్సీ స్టాండ్ యూనియన్ గురువారం అన్నదానం నిర్వహించింది. శరన్నవరాత్రి ఉత్సవాల ముగింపులో భాగంగా అన్నదానం చేశామని ట్యాక్సీ యూనియన్ ప్రతినిధులు తెలిపారు. రాజాంతో పాటు చుట్టు పక్క ప్రాంతాలకు చెందిన సుమారు 2500 మంది అన్నప్రసాదం స్వీకరించారు. యూనియన్ సభ్యులు శాసపు శ్రీరామమూర్తి, గంధం నారాయణరావు, ఆబోతుల గణ, హరిబాబు, వి.నారాయణరావు, బలరాం, నారాయణరావు, మీసాల శంకర్ పాల్గొన్నారు.

కొఠారిపురంలో వైద్య శిబిరం



శిబిరంలో సేవలందిస్తున్న వైద్యులు

రాజాం సిటీ: మండలంలోని కొఠారిపురం గ్రామంలో శ్రీకాకుళం మెడికవర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. మెడికవర్‌ఆస్పత్రి వైద్యులు శిబిరంలో గ్రామస్తులకు బీపీ, సుగర్ పరీక్షలతో పాటు గుండె సంబంధిత, ఇతర వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేసి, ఆరోగ్య జాగ్రత్తలు సూచించారు.

ఆస్పత్రి సూపరింటెండెంట్‌కు సన్మానం



డాక్టర్ హరిబాబును వివిధ సంస్థల ప్రతినిధులు

రాజాం: స్థానిక ఏరియా ఆస్పత్రిని ప్రభుత్వం స్వచ్ఛ ఆస్పత్రిగా గుర్తించడంతో ఆస్పత్రి సూపరిం టెండెంట్ డాక్టర్ కరణం హరిబాబుకు జిల్లా కలెక్టర్ ఇటీవల అవార్డు అందజేశారు.ఈ నేపథ్యం లో ఆస్పత్రి సూపరింటెండెంట్‌ను రాజాం రెడ్‌క్రాస్, వికాస తరంగణి, పర్యావరణ పరిరక్షణ సమితి సంఘాల సభ్యులు హాస్పిటల్ ఆవరణలో గురువారం సన్మానించారు. ఆయా సంఘాల సభ్యులు కొత్తా సాయిప్రశాంత్‌కుమార్, టి.టి.వి.రమణమూర్తి, ఆర్.వి.జె. నాయుడు, పెంకి చైతన్యకుమార్, రెడ్డి శ్రీనివాసరావు, గట్టి పాపారావు, తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీఓకు సత్కారం



ఎస్టీఓ పద్మనాభంను సత్కరిస్తున్న జేసీ రాజు, తదితరులు

బొబ్బిలి: జిల్లా ఉత్తమ స్వచ్ఛ ప్రభుత్వ కార్యాలయంగా స్థానిక ఎస్టీఓ ఆఫీస్‌కి ఇటీవల అవార్డు రావడంతో ఎస్టీఓ పి.వి.పద్మనాభంను కారుణ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం సత్కరించారు. ఎస్టీఓ కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కారుణ్య ఫౌండేషన్ సంస్థ చైర్మన్ జేసీ రాజు మాట్లాడుతూ ఎస్టీఓ కార్యాలయానికి అవార్డు రావడం ఆనందంగా ఉందన్నారు. ఎస్టీఓ పద్మనాభం ముమ్ముందుకు కూడా ఉద్యోగులు,పెన్షనర్లకు ఉన్నతమైన సేవలందించి మరిన్ని అవార్డులు సాధించాలని అభిలషించారు. కారుణ్య ఫౌండేషన్ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రజలకు ప్రయోజనం చేకూరే పనులకే ప్రాధాన్యం



గ్రామసభలో మాట్లాడుతున్న ఎంపీడీఓ రామకృష్ణ

బాడంగి: ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాల్లో ప్రజలకు ప్రయోజనం చేకూరే పనులకే ప్రాధాన్యం ఇవ్వాలని ఎంపీడీఓ ఎస్.రామకృష్ణ ఉపాధి సిబ్బం దికి సూచించారు. 2026–27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి బాడంగి పంచాయతీలో చేపట్టనున్న ఉపాధి పనుల గుర్తింపునకు స్థానిక పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ కండి రమేష్ అధ్యక్షతన గురువారం గ్రామసభ నిర్వహించారు.ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామసభలో గ్రామస్తు లు సూచించిన పనులు చేపట్టేందుకు అంచనాలు సిద్ధం చేయాలని ఉపాధి సిబ్బందిని ఆదేశించారు. రైతులకు సంబంధించి ఉద్యానవన పంటలు, ఫారంపాండ్ల నిర్మాణం, కంపోస్టు పిట్లు, బౌండరీ ట్రెంచ్ వర్క్సు పనులు చేపట్టాలని చెప్పారు. ఉపాధి వేతనదారులంతా తప్పనిసరిగా ఈకెవైసీ చేయించుకోవాలన్నారు. జెడ్పీటీసీ పెద్దింటి రామారావు, ఉపాధి ఏపీఓ సాయిరాం, పంచాయతీ కార్యదర్శి, ఉపాధిహామి సిబ్బంది,సచివాలయ సిబ్బంది, వేతనదారులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీలపై చిన్నచూపు..!

- కాలనీల్లో సమస్యలను పట్టించుకోని కూటమి ప్రభుత్వం
- సీసీ రోడ్ల నిర్మాణం, వీధి లైట్ల నిర్వహణను విస్మరించిన అధికారులు



తుప్పలు, డొంకలతో తెర్లాం జగనన్న కాలనీలోని ఓ వీధి

తెర్లాం: పేదవాడి సొంతింటి కల సాకారం చేసేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం జగనన్న కాలనీలను ఏర్పాటు చేసింది. మండల కేంద్రాలతో పాటు గ్రామాల్లో లేఅవుట్లు ఏర్పాటు చేసి అర్హులకు వాటిలో ఇళ్ల స్థలాలు ఇవ్వడంతో పాటు నిర్మాణాలకు ఆర్థిక సహాయం అందజేశారు. ఇళ్ల నిర్మాణాల కోసం, తాగునీటి అవసరాల కోసం బోర్లు తవ్వించడం, విద్యుత్ స్తంభాల ఏర్పాటు వంటి పనులను చేపట్టారు. కొన్ని లేఅవుట్లలో సిమెంట్ రోడ్లు, సీసీ కాలువల నిర్మాణాలు కూడా చేపట్టారు. చాలా వరకు జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు పూర్తి కావడం, లబ్ధిదారులు గృహ ప్రవేశం చేయడం జరిగింది.కాలనీల్లో మౌలిక సదుపాయాలకు సంబంధించి న కొన్ని పనులు సార్వత్రిక ఎన్నికల సమయంలో నిలిచిపోయాయి. ఎన్నికల అనంతరం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం జగనన్న కాలనీల పేరు మార్చుతూ జీఓ ఇచ్చింది కానీ ఆ కాలనీల్లో సమస్య లను పట్టించుకోవడం లేదు. తెర్లాం మండల కేంద్రంతోపాటు, పలు గ్రామాల్లో ఉన్న జగనన్న కాలనీల్లో సమస్యలు పరిష్కారం కావడం లేదు. తెర్లాంలోని జగనన్న కాలనీలో 98 ఇళ్ల నిర్మాణాలు గత ప్రభుత్వ హయాంలోనే పూర్తయ్యాయి. ఆయా కుటుంబాల వారు ఆ ఇళ్లలోనే నివాసముంటున్నారు. అయితే ఇక్కడ సిమెంటు రోడ్లు, కాలువల నిర్మాణం పూర్తి కాకపోవడంతో స్థాని కులు ఇబ్బందులు పడుతున్నారు. వీధి స్తంభాలకు గతంలో ఏర్పాటు చేసిన లైట్లలో కొన్ని పాడవ్వగా, వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయలేదు. గతంలో తాగునీటి సౌకర్యం కోసం బోర్లు ఏర్పాటు చేసి సామూహిక కుళాయి పాయింట్లు ఏర్పాటు చేశారు. ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు చేయాలని అధికారులను కాలనీ వాసులు వేడుకుంటున్నా పట్టించుకోవడం లేదు. సమస్యలు పరిష్కరించాలని మండల అధికారులకు తెర్లాం జగనన్న కాలనీ వాసులు వినతి పత్రాలు అందజేసినా ఎలాంటి ఫలితం లేకుండా పోయింది.

సౌకర్యాలు మెరుగుపరచాలి



జగనన్న పుణ్యమా అని సొంత ఇంటి కల నెరవేరింది. జగనన్న కాలనీలో కొన్ని సమస్యలు ఉన్నాయి. కాలనీలో సౌకర్యాలు మెరుగుపరచాలి. వీధి దీపాల నిర్వహణ కూడా చేపట్టడం లేదు. సిమెంటు రోడ్లు, కాలువలు నిర్మించాలి. సమస్యల పరిష్కారానికి అధికారులు చొరవ చూపాలి.

– ఎస్.శ్రీను, తెర్లాం

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతా



తెర్లాంలోని జగనన్న కాలనీలో కొన్ని సమస్యలు ఉన్నమాట వాస్తవమే. కాలనీవాసులు వినతిపత్రం అందజేశారు. సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతాను. గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న సమస్యలను పరిష్కరించాం. విద్యుత్, సీసీ రోడ్లు, కాలువల నిర్మాణంపై అధికారులకు తెలియజేస్తాను.

– రవికుమార్, పంచాయతీ ఈఓ, తెర్లాం.

నాణ్యమైన భోజనం అందించకుంటే చర్యలు

- ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయ ప్రతాప్‌రెడ్డి



రామభద్రపురం: బూసాయవలస కేజీబీవీలో విద్యార్థినులకు భోజనం వడ్డిస్తున్న ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయప్రతాప్‌రెడ్డి

రామభద్రపురం: ప్రభుత్వ ఆశ్రమ,గురుకుల పాఠశాలలు,సాంఘిక సంక్షేమ వసతి గృహాలు, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు నాణ్యమైన భోజనం అందించకుంటే ఆయా యాజ మాన్యాలపై చర్యలు తప్పవని ఏపీ స్టేట్ ఫుడ్ కమిషన్ చైర్మన్ సీహెచ్. విజయ ప్రతాప్‌రెడ్డి హెచ్చరించారు. రామభద్రపురం అంగన్‌వాడీ కేంద్రం–5, బూసాయవలస అంగన్‌వాడీ కేంద్రంతో పాటు అక్కడి కస్తుర్బా గాంధీ బాలికల విద్యాలయం(కేజీబీవీ)ను గురువారం ఆయన సందర్శించారు. పిల్లలకు అందించే భోజనాలను రుచి చూశారు. బూసాయవలస కేజీబీవీలో విద్యార్థినులకు ఆయనే స్వయంగా భోజనం వడ్డించారు. బూసాయవలస అంగన్‌వాడీ కేంద్రం,కేజీబీవీలో భోజనాలు బాగున్నాయని సంతృప్తి వ్యక్తం చేశారు. కేజీబీవీ విద్యార్థినులతో ఆయన మాట్లాడుతూ వంటకాల్లో ఏ వంటనైనా మార్చాలా అని అడగగా ఉప్మా స్థానంలో వేరే వంటకం పెట్టాలని పిల్లలు చెప్పారు. ఉప్మాకు బదులుగా ఎగ్ ఫ్రైడ్ రైస్ పెట్టాలని ఎస్ఓకు సూచించారు. రామభద్రపురం అంగన్‌వాడీ కేంద్రం–5లో కాలం చెల్లిన 8 కందిపప్పు ప్యాకెట్లను గుర్తించారు.కాలం చెల్లిన పప్పు వండి పిల్లలకు పెడితే వారికి ఏమైనా అనారోగ్య సమస్య వస్తే ఎవరు బాధ్యత వహిస్తారని సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే వాటిని మార్చాలని ఐసీడీఎస్ పీఓ వరహాలమ్మ, సూపర్‌వైజర్ సూర్యకుమారిని ఆదేశించారు. ఎప్పటికప్పుడు అంగన్‌వాడీ కేంద్రాల్లో తనిఖీలు చేయాలని సూచించారు.

బియ్యాన్ని అత్తెసరుగానే వండాలి

బొబ్బిలి: పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేస్తున్న ఫోర్టిఫైడ్ రైస్‌ను అత్తెసరుగానే వండేలా చూడాలని ఏపీ స్టేట్ ఫుడ్ కమిషన్ చైర్మన్ సీహెచ్.విజయప్రతాప్ విద్యాశాఖ అధికారులకు సూచించారు. బొబ్బిలి పట్టణంలోని స్వామివారి వీధి అంగన్‌వాడీ కేంద్రం, టి.ఆర్.కాలనీలోని రేషన్ డిపోను, డీపీఈపీ పాఠశాలను గురువారం సందర్శించారు. డీపీఈపీ పాఠశాలలో అన్నం,గంజి వేరు వేరుగా ఉండడాన్ని గమనించారు. ఫోర్టిఫైడ్ రైస్‌లో పోషకాలతో కృత్రిమంగా తయారు చేసిన గింజలు ఉంటాయని, వాటిని వండి వార్చడం వల్ల గంజిలో పోషకాలు పోతాయన్నారు. అత్తెసరు అన్నంలా వండుకోవాలని వంట నిర్వాహకులకు సూచించారు. అన్నీ పాఠశాలలకు ఇదే విషయాన్ని వివరించాలని డిప్యూటీ ఈఓ మోహనరావును ఆదేశించారు.అనంతరం పారాది ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాలను పరిశీలించారు. ఆయన వెంట ఐసీడీఎస్, సివిల్ సప్లై,విద్యాశాఖ అధికారులున్నారు.

సీజేఐపై దాడి హేయం



నిరసన తెలుపుతున్న దళిత బహుజన సంఘాల సభ్యులు



రాజాం సిటీ: నిరసన తెలుపుతున్న ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు

వంగర: దేశఅత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టులో చీఫ్ జస్టిస్ బి.ఆర్.గవాయ్‌పై న్యాయవాది రాకేష్‌కిషోర్ బూటు విసరడం హే యమైన చర్య అని దళిత బహుజన సంఘాల నాయకులు మండిపడ్డారు. స్థానిక బస్టాండ్ ఆవరణలోని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహం వద్ద దళిత బహుజన సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో గురువారం నిరసన తెలిపారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడికి పాల్పడిన న్యాయవాదిపై రాజద్రోహం కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహాలపై దాడులకు పాల్పడుతున్న వ్యక్తులపై కేసులు నమోదు చేయాలని కోరారు. దళిత బహుజన సంఘాల జేఏసీ నాయకులు మజ్జి గణపతి, ఎం.గణపతిరావు, చిత్తిరి గంగులు, సిర్లి రాజు, పేడాడ అప్పన్న, తిర్లంగి సింహాచలం, డి.చిన్న,తదితరులు పాల్గొన్నారు.

రాజాంలో..

రాజాం సిటీ: సుప్రీం కోర్టు న్యాయమూర్తి బి.ఆర్.గవాయ్‌పై న్యాయవాది దాడికి యత్నించడం అమానుషమని ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు అన్నారు. గురువారం రాత్రి స్థానిక అంబేడ్కర్ జంక్షన్‌లో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఎస్సీవెల్ఫేర్ అసోసియేషన్ ముఖ్యసలహాదారు జరజాన నీలయ్య, అధ్యక్షుడు ధర్మాన కృష్ణ, కార్యదర్శి బోనెల గౌరీశ్వరరావు, సభ్యులు అల్లిన తవిటిరావు, వడ్డి పాపారావు, తేగల మోహనరావు, వి.దాలయ్య, ఈ.తవిటయ్య,డి.సత్యం, కె.దిలీప్, శంకర్, అప్పన్న, అప్పారావు పాల్గొన్నారు.

నేటి నుంచి బోధనేతర పనుల బహిష్కరణ



బొబ్బిలిరూరల్: ఎంఈఓ రమేష్‌కుమార్‌కు మెమోరాండం అందజేస్తోన్న ఫ్యాప్టో నాయకులు



వంగర: ఎంఈఓ కూర్మినాయుడుకు మెమోరాండం అందజేస్తున్న ఫ్యాప్టో నాయకులు

బొబ్బిలిరూరల్/ వంగర: ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులకు ప్రభుత్వం అప్పగిస్తున్న బోధనేతర పనులను శుక్రవారం నుంచి బహిష్కరిస్తున్నట్టు ఫ్యాప్టో సంఘం నేతలు తెలిపారు.ఈమేరకు బొబ్బిలి ఎమ్మార్సీలో ఎంఈఓ రమేష్ కుమార్‌కు ఫ్యాప్టో నాయకులు కె.జోగారావు, వెంకటనాయుడు, రామారావు, తదితరులు, వంగర ఎమ్మార్సీలో ఎం.కూర్మినాయుడుకు ఫ్యాప్టో నాయకులు బలగ ప్రసాద్, పెంకి గౌరీశంకర్‌రావు, బి.శ్రీనివాసరావు, వై. సురేష్ గురువారం మెమోరాండం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలని పలుమార్లు ప్రభుత్వ పెద్దలు, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం కనిపించలేదని వాపోయారు. సమస్య పరిష్కారం కాకపోగా, మరిన్ని యాప్స్ పెరుగుతున్న కారణంగా ఉపాధ్యాయులు బోధనకు దూరం కావడం జరుగుతోందని వెల్లడించారు. బోధనేతర పనుల వల్లవిద్యార్థులకు సరైన విద్యను అందించలేకపోతున్నామని, తద్వారా పిల్లలు ప్రభుత్వ బడికి దూరం అయ్యే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యపై ఈనెల 7న ఫ్యాప్టో పోరుబాట కార్యక్రమం నిర్వహించిందని గుర్తు చేశారు. ఈనెల 10 నుంచి ఉపాధ్యాయులు బోధనకే పరిమితం కావాలని, బోధనేతర పనులైన విద్యాశక్తి, జీఎస్‌టీ 2.0 వంటి, సీజనల్ ప్రచారం, గూగుల్ షీట్స్ నింపడం, గ్రీన్ పోస్టర్లు ఆవిష్కరించడం వంటివి బహిష్కరించాలని పిలుపునిచ్చారు. కేవలం ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు, ఎండీఎం నిర్వహణ, పరీక్షల నిర్వహణ మాత్రమే చేయాలని అన్నారు.

ప్రజాస్వామ్య విలువలకు తిలోదకాలు



సంతకాల సేకరణ చేపడుతున్న కాంగ్రెస్ నాయకులు

బొబ్బిలి: కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ప్రజాస్వామ్య విలువలకు తిలోదకాలిస్తోందని, ప్రజల ఓట్లను చోరీ చేస్తూ ప్రజాస్వామ్యాన్ని పరిహాసం చేస్తోందని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మరిపి విద్యాసాగర్ విమర్శించారు. ఓటర్ల జాబితాలోని అవకతవకలపై కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న ఉద్యమంలో భాగంగా బొబ్బిలి పట్టణంలో గురువారం సంతకాల సేకరణ చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దొంగ ఓట్లతో మూడో సారి గద్దెనెక్కిన మోదీ నిజమైన ఓటర్ల హక్కును కాలరాశారని, బీజేపీ ఓట్ చోరీకి పాల్పడిందని ఆరోపించారు. ప్రజలు తమకు నచ్చిన నాయకుడిని ఎన్నుకునే హక్కును, అధికారాన్ని కోల్పోయారన్నారు. ఓట్ చోరీపై రాహుల్‌గాంధీ చేపట్టిన ఉద్యమానికి అంతా మద్దతు పలకాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ బొబ్బిలి నియోజకవర్గ ఇన్‌చార్జ్ ముద్దల శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

పంటకోత ప్రయోగాలపై శిక్షణ



మాట్లాడుతున్న ఏఓ రఘునాథ్

రాజాం: ఖరీఫ్ వరి పంట దిగుబడులు లెక్కకట్టేందుకు పంటకోత ప్రయోగాలకు వీఏఏలు సిద్ధం కావాలని మండల వ్యవసాయ అధికారి సీహెచ్.రఘునాథ్ సూచించారు. స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో మండలంలోని పలు రైతు సేవా కేంద్రాలకు చెందిన వీఏఏలకు పంటకోత ప్రయోగాలపై గురువారం శిక్షణ కల్పించారు. పొలంలో కొలతలు నిర్ధారించడం, దిగుబడి అంచనాలు కట్టడం వివరించారు. అనంతరం ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన అమలు, ఫార్మ్ సెలెక్షన్, సబ్మిషన్ అంశాలపై చర్చించారు. ఏఈఓలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

వంగర: మద్దువలస 11 కేవీ విద్యుత్ లైన్ పరిధి గ్రామాలకు శుక్రవారం ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటలకు వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనుందని విద్యుత్ శాఖ ఏఈ జి.సురేష్ కుమార్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 11 కేవీ విద్యుత్ లైన్‌లో మరమ్మతులు, విద్యుత్ తీగలకు ఆనుకుని ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు పనులు చేపట్టనున్న నేపథ్యంలో సరసనాపల్లి, మద్దువలస, జగన్నాథవలస, కొండవలస, అరసాడ, నీలయ్యవలస, బాగెంపేట, పట్టువర్ధనం, శ్రీహరిపురం, ఆర్‌ఆర్ కాలనీ, కింజంగి తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరాలో ఉండదని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఇద్దనవలసలో పశువైద్య శిబిరం



పాడిరైతులకు మినరల్ మిక్చర్ అందజేస్తున్న పశువైద్యాధికారులు

మెంటాడ: మండలంలోని ఇద్దనవలస గ్రామంలో చల్లపేట పశువైద్యశాల ఆధ్వర్యంలో గురువా రం పశువైద్యశిబిరం నిర్వహించారు. పశువైద్యాధికారులు సతీష్‌కుమార్, బాల సందీప్, జగదీష్ 57 పశువులకు గర్భకోశ వ్యాధి నివారణ చికిత్స, 46 పశువులకు సాధారణ వైద్యపరీక్షలు చేశారు. శిబిరాన్ని విజయనగరం జిల్లా సంయుక్త సంచాలకులు డాక్టర్ మురళీకృష్ణ, విజయనగరం డివిజన్ సహాయ సంచాలకులు డాక్టర్ దామోదర్ సందర్శించారు. పాడి రైతులకు మినరల్ మిక్చర్ అందజేశారు. సర్పంచ్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రాయిపల్లి రామారావు పాల్గొన్నారు.

చలో విజయవాడ రేపు

రేగిడి: 1998 డీఎస్సీ ఎంటీఎస్ ఉపాధ్యాయులను రెగ్యులర్ చేయాలని కోరుతూ ఈ నెల 11న విజయవాడలోని ధర్నాచౌక్ వద్ద విజ్ఞాపన సభ నిర్వహించనున్నట్లు ఆ ఎంటీఎస్ ఉపాధ్యాయుల రాష్ట్రసంఘం నాయకులు ఎస్.రాజగోపాలనాయుడు, సీహెచ్ మల్లేశ్వరరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 98 డీఎస్సీ అభ్యర్థులకు ఎన్నో ఏళ్ల పోరాటం తర్వాత 2023లో గత ప్రభుత్వం ఎంటీఎస్ పద్ధతిలో పోస్టింగ్ ఇచ్చిందని పేర్కొన్నారు. తమను రెగ్యులర్ చేయాలని, అలవెన్స్‌లు, ఇతర సదుపా యాలు కల్పించాలని కోరుతూ నిర్వహిస్తున్న విజ్ఞాపన సభకు ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో ఉన్న 98 డీఎస్సీ ఎంటీఎస్ ఉపాధ్యాయులంతా హాజరై విజయవంతం చేయాలని కోరారు.

కంటి సంరక్షణపై అవగాహన అవసరం



జాం సిటీ: ప్రభుత్వ జూనియర్ బాలుర కళాశాలలో అవగాహన కల్పిస్తున్న ఆప్తాలమిక్ అధికారి వసంతరావు



తెర్లాం: పెరుమాళి మోడల్ స్కూల్‌లో చిత్రలేఖనం పోటీల్లో విజేతకు ప్రశంసా పత్రం అందజేస్తున్న ప్రిన్సిపాల్ జ్యోతిలక్ష్మి, ఆప్తాలమిక్ అధికారి

రాజాం సిటీ: ప్రతి ఒక్కరూ కంటి సంరక్షణపై అవగాహన కలిగి ఉండాలని రొటేరియన్, పెరుమాళి పీహెచ్‌సీ ఆప్తాలమిక్ అధికారి ఎస్.వసంతరావు అన్నారు. ప్రపంచ దృష్టి దినోత్సవం సందర్భంగా జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ జూనియర్ బాలుర కళాశాలలో కంటి సంరక్షణపై గురువారం అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుకు నే సమయంలో వెలుతురు సరిగా ఉండేలా చూసుకోవాలని అన్నారు. అలాగే సెల్‌ఫోన్, టీవీలతో కాలక్షేపం చేయకుండా రోజూ ఒక గంట సమయం ఆరుబయట ఆటలు ఆడాలని సూచించారు. ఆకుకూరలు, పౌష్టికాహారం తీసుకోవాలని చెప్పారు. ప్రిన్సిపాల్ డి.రామారావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

బహుమతుల ప్రదానం

తెర్లాం: ప్రపంచ దృష్టి దినోత్సవం సందర్భంగా పెరుమాళి మోడల్ స్కూల్‌లో జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో 'మీ కళ్లను ప్రేమించండి' అనే అంశంపై విద్యార్థులకు బుధవారం చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు.పోటీల్లో 150మంది విద్యార్థులు పాల్గొనగా, వారిలో 15 మంది విద్యార్థులు గీచిన చిత్రాలను ఉత్తమ చిత్రాలుగా గురువారం ఎంపిక చేసి, బహుమతులు అందజేశారు.అతిథిగా హాజరైన పెరుమాళి పీహెచ్‌సీ ఆప్తాలమిక్ అధికారి ఎస్.వసంతరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కంటి ఆరోగ్యంపై దృష్టి సారించాలని అన్నారు. ప్రిన్సిపాల్ జ్యోతిలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వీఓఏల సమస్యలు పరిష్కరించాలి



వెలుగు అధికారులకు మెమోరాండం ఇస్తున్న వీఓఏలు

రాజాం: వీఓఏల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మండల వీఓఏలు స్థానిక వెలుగు కార్యాలయంలో వెలుగు అధికారులకు గురువారం మెమోరాండం అందజేశారు. ఈ సందర్భంగా ఆ యూనియన్ అధ్యక్షురాలు సీహెచ్.రూపాదేవి, ప్రధాన కార్యదర్శి ధనలక్ష్మి మాట్లాడుతూ వీఓఏల సమస్యలను పరిష్కరించాలని గత కొంతకాలంగా ప్రభుత్వాన్ని కోరుతున్నా పట్టించుకోవడంలేదని వాపోయారు. 5జీ మొబైల్స్ అడుగుతుంటే ఇవ్వకుండా, సాధారణ మొబైల్స్‌తో మహిళా సంఘాల ఆర్థిక లావాదేవీలు, ఇతర వివరాలను ఆన్‌లైన్ చేయమని ఒత్తిడి చేస్తున్నారని వాపోయా రు. 5జీ మొబైల్స్ ఇచ్చేవరకూ ఆన్‌లైన్ పనులు చేయమని పేర్కొన్నారు. ప్రతీ పనికి టార్గెట్ ఇవ్వడం సబబుకదని మండిపడ్డారు. బకాయి వేతనాలు చెల్లించాలని, ఆన్‌లైన్ పనిభారాన్ని తగ్గించాలని, కాలపరమితి సర్క్యులర్ రద్దుచేయాలని, కనీస వేతనాలు చెల్లించాలని, హెచ్‌ఆర్‌సీ పాలసీ అమలుచేయాలని, రూ. 10 లక్షల గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని, రూ.2 లక్షల స్త్రీ నిధి ఇన్సెంటివ్స్ ఇవ్వాలని, రాజకీయ వేధింపులు, అక్రమ తొలగింపులు ఆపాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్లు పరిష్కరించే వరకూ పోరాటం చేస్తామని హెచ్చరించారు. పలు గ్రామాలకు చెందిన వీఓఏలు పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుపై అవగాహన

రేగిడి: జీఎస్టీ తగ్గింపుల వల్ల కలిగే ప్రయోజనాలను ఖండ్యాం గ్రామస్తులకు ఖండ్యాం ఆయుర్వేద కేంద్రం వైద్యాధికారి ఎం.సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం వాడే ప్రాణాధార, సాధారణ మందులపై జీఎస్టీ రేట్లు తగ్గాయని వెల్లడించారు. థర్మామీటర్లు, బీపీ మెషిన్లు, గ్లూకోమీటర్లు, కళ్లద్దాలపై 6 నుంచి 12 శాతం వరకు ధరలు తగ్గాయని వివరించారు. ఎంఎల్‌హెచ్‌పీ సుఖి, ఏఎన్ఎం స్వాతి, ఆశ వర్కర్లు, పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధిలో సర్పంచ్‌ల పాత్ర కీలకం



వంగర: మాట్లాడుతున్న ఎంపీడీఓ రాజారావు

వంగర/రాజాం సిటీ/రేగిడి: గ్రామాల అభివృద్ధిలో సర్పంచ్‌ల పాత్ర కీలకమని వంగర, రాజాం, రేగిడి ఎంపీడీఓలు టి.రాజారావు, జె.ఆనంద వు, శ్యామలాకుమారి అన్నారు. ఆయా మండల పరిషత్ కార్యాలయాల్లో ఆయా మండలాల్లోని సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు ఓఎస్ఆర్(ఓన్ సోర్స్ రెవెన్యూ)అంశంపై రెండు రోజుల పాటు నిర్వహించనున్న శిక్షణ తరగతులను గురువారం వారు ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే నిధులపై ఆధారపడకుండా పంచాయతీలు సొంతంగా ఆదాయ వనరులు సమకూర్చు వాలని అన్నారు. అందుకు అనుగుణంగా పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు ప్రణాళికలు రూపొందించుకోవాలని చెప్పారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల్లో సేంద్రియ ఎరువులు తయారు చేసి రైతులకు విక్రయించాలని, పన్నులు వసూళ్లపై దృష్టిసారించాలని, పంచాయతీల పరిధిలో చిన్న చిన్న పరిశ్రమలు ఏర్పాటు చేసుకునే వారిని ప్రోత్సహించాలని, పంచాయతీ స్థలాల్లో దుకాణాలు నిర్మించి వాణిజ్య అవసరాలకు అద్దెకు ఇవ్వడం ద్వారా ఆదాయం సమకూర్చుకోవచ్చని చెప్పారు. డిప్యూటీ ఎంపీడీఓలు పాల్గొన్నారు.

ఇస్రో విజయాలపై వ్యాసరచన పోటీలు



విజేతలతో నిర్వాహకులు

బొబ్బిలి: స్థానిక రాజా కళాశాలలో ఇస్రో ఆధ్వర్యంలో ప్రపంచ అంతరిక్ష వారోత్సవం–2025 కార్యక్రమం రెండో రోజు గురువారం కొనసాగింది. అంతరిక్ష అన్వేషణలో ఇస్రో విజయాలు అన్న అంశపై వివిధ పాఠశాలలకు చెందిన 6,7,8 తరగతుల విద్యార్థులకు గురువారం క్విజ్, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలకు కళాశాల సెక్రటరీ బదరీ, ప్రిన్సిపాల్ వీరేంద్రకుమార్, షార్,ఎస్డీఎస్సీ,ఎస్ఎంపీసీ డిప్యూటీ డైరెక్టర్ జి.రమేష్‌బాబు బహుమతులు అందజేసి అభినందించారు.